క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీలు

మల్కాపురం: స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మల్కాపురం పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. యారాడ పార్కు గేటు వద్ద సీఐ గొలగాని అప్పారావు,ఎస్ఐ శ్రీనివాస్‌రావు ఇతర సిబ్బందితో కలిసి ఆ మార్గంలో పలు వాహనాలు నిలిపి తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలను పరిశీలించారు.అనుమానిలను,అనుమానిత వాహనాలను స్టేషన్‌కు తరలించారు. సీఐ అప్పారావు మాట్లాడుతూ ఇటీవల గంజాయి వంటి మాదకద్రవ్యాలు వాహనాల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్టు వివరించారు. సింధియా,కోరమాండల్ వంటి కూడళ్లలో కూడా తనిఖీలు చేపట్టారు.

కృష్ణకు అభినందనలు



వైఎస్సార్‌సీపీ 58వ వార్డు అధ్యక్షుడు కృష్ణను అభినందిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన పార్టీ సీనియర్ నాయకుడు గులిగిందల కృష్ణను బుధవారం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు, శాలువాలు కప్పి అభినందించారు. గుల్లలపాలెం పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ లావణ్య, నాయకులు ఉద్దా భాస్కర్, గొందేశి సత్యనారాయణ రెడ్డి,సాల్మన్‌రాజు,ధర్మాల వేణుగోపాలరెడ్డి,జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు),చిన్న సత్యనారాయణరెడ్డి,పెద్దాడ వెంకటరమణ తదితరులు ఆయన్ను సత్కరించారు.

వనాల వృద్ధి కోసం..



విత్తనబంతులు విసురుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: వనాల వృద్ధి కోసం విత్తన బంతులు విసిరారు విద్యార్థులు. జీవీఎంసీ 88వ వార్డు నరవ కొండవాలు ప్రాంతాల్లో బెహరా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గోపాలపట్నం బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు తయారు చేసిన విత్తన బంతులను ఇంజినీరింగ్ విద్యార్థులకు అందించారు. వీరు నరవ ప్రాంతంలోని కొండవాలు ప్రాంతాల్లో ఆ విత్తన బంతులు విసిరి, సామాజికవనాల అభివృద్ధికి సహకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ గోవిందరావు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

- 5న ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన
- జయప్రదం చేయాలని సీపీఐ శ్రేణుల పిలుపు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ తదితరులు

అల్లిపురం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు 5వ తేదీన ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ పిలుపునిచ్చారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదానీతో సోలార్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ. 15,487 కోట్ల భారం వేసిందని ఆరోపించారు. మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె. సత్యనారాయణ పి. చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాలు, ఎం.మన్మథరావు, ఎన్. నాగభూషణ్, ఎండీ బేగం, అన్వేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల కల.. కల్లేనా!

ఒకటి కాదు రెండు కాదు.. 40 ఏళ్ల నుంచి ఆ స్థలం ఖాళీగా ఉంది. అక్కడ క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన అటకెక్కింది. పలు మార్లు శంకుస్థాపనలు చేసినా పనులు సాగలేదు. పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపినా క్రీడాకారులు ఉన్నా.. మైదానానికి నోచుకోలేక పోతున్నారు. ప్రధాన ప్రాంతాల మధ్యలో ఉన్న విలువైన స్థలాన్ని మైదానంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత క్రీడాకారులు, ప్రజలు చేస్తున్న విన్నపాలు బుట్టదాఖలవుతున్నాయి.

– మల్కాపురం

- 40 ఏళ్లుగా క్రీడా మైదానం కోసం ఎదురు చూపులు
- ప్రతిపాదనలకే పరిమితం
- డంపింగ్ యార్డ్‌గా విలువైన స్థలం



మల్కాపురం, ప్రకాష్‌నగర్ మధ్య ఖాళీగా ఉన్న విలువైన స్థలం

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధి నుంచి ప్రకాష్‌నగర్‌కు వెళ్లే మార్గ మధ్యలో సుమారు 4.60 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఈ స్థలం విశాఖ పోర్టు ఆధీనంలో ఉంది. ఇటు మల్కాపురానికి అటు ప్రకాష్‌నగర్‌కు మధ్యలో ఉన్న స్థలంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేగా పని చేసిన మళ్ల విజయప్రసాద్ మైదానంతో పాటు వాకింగ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు.దీనిలో భాగంగా ఆయన అప్పటి పోర్టు అధికారులతో మాట్లాడి ఈ స్థలం తీసుకుని బదులుగా వారికి నగర శివారు ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు యత్నించారు. నాడు కేంద్ర మంత్రిగా దగ్గుపాటి పురంధరేశ్వరిని స్వయంగా స్థలం వద్దకు తీసుకువచ్చి సమస్యను వివరించారు. ఆమె కూడా పోర్టు అధికారులతో మాట్లాడి భూమిని ఇక్కడ ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు.

అధికారం మారడంతో..

ఇంతలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. మరలా ఈ అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గత వారం ప్రభుత్వ విప్ గణబాబును కలిసి క్రీడామైదానం,వాకింగ్ పార్కుతో పాటు ఇతర ప్రజా అవసరాలకు ఉపయోగపడే భవనాలు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. గతంలో జరిగిన ప్రతిపాదనలను ఆయనకు వివరించారు. ఆయన స్పందించి పోర్టు అధికారులతో మాట్లాడి ఆ స్థలానికి బదులు వేరే చోట ప్రభుత్వ స్థలం ఇచ్చే విధంగా చర్చిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సారైనా..



పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పరిధిలో ఎక్కడా క్రీడామైదానం లేదు. దీంతో ఈ ప్రాంత వాసులు నగరానికి కొందరు.. మరి కొందరు జింక్, షిప్‌యార్డ్ క్రీడామైదానాలకు వెళ్లి క్రీడల్లో శిక్షణ తీసుకోవాల్సి వస్తుంది. పాలకులు ఈ సారైనా దీనిపై దృష్టి పెట్టి మల్కాపురంలోని విలువైన స్థలంలో క్రీడామైదానం నిర్మించాలి.

– ఆకుల కనకరాజు, జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు

సరైన మైదానం లేదు



ఎంతో పేరు ఉన్న పారిశ్రామిక ప్రాంతానికి ఒక్క క్రీడామైదానం లేదు.నేను బాక్సింగ్ ప్రాక్టీస్ చేసే రోజుల్లో జింక్ మైదానానికి వెళ్లేవాడిని. మల్కాపురం,ప్రకాష్‌నగర్ వాసులకు వాకింగ్ పార్కు కూడా లేదు.అధికారులు,పాలకులు సమస్యపై స్పందించి మల్కాపురం వద్ద విలువైన స్థలంలో క్రీడామైదానం ,వాకింగ్ పార్కు ఏర్పాటు చేయాలి.

– పంచదార్ల అప్పలరాజుయాదవ్, జాతీయ బాక్సింగ్ ప్లేయర్

సాధనకు అవస్థలు



మల్కాపురం ప్రాంతంలో మైదానం లేక నగరంలోని స్వర్ణభారతి స్టేడియంకు వెళ్లాల్సి వస్తుంది. జింక్ క్రీడా మైదానానికి వెళ్తున్నారు. నదీని వల్ల చాలా మంది ఆసక్తి ఉన్నా క్రీడల వైపు మొగ్గు చూపడం లేదు.అధికారులు, పాలకులు స్పందించి మల్కాపురంలో మైదానం నిర్మించాలి.

– వాకాడ రేష్మాయాదవ్, స్టేట్ ఉమెన్ బాక్సర్

ప్రభుత్వ విప్ దృష్టికి సమస్య



మల్కాపురం,ప్రకాష్‌నగర్ గ్రామాలకు మధ్యలో గల విలువైన పోర్టు స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని అందులో క్రీడామైదానం, వాకింగ్ పార్కు,విశ్రాంతి ఉద్యోగుల కోసం భవనం,చిన్నారుల కోసం గ్రంథాలయం నిర్మించాలని ప్రభుత్వ విప్ గణబాబుకు వివరించాం.ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ సారి ఆ స్థలంలో మంచి నిర్మాణాలు జరుగుతాయని ఆశిస్తున్నాం.

– ఉరుకూటి బాబూరావు, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి

పట్టపగలే వెలుగులు



నాగేంద్ర కాలనీలో వెలుగుతున్న దీపం

జీవీఎంసీ 92వ వార్డు నాగేంద్ర కాలనీలో పట్టపగలే వెలుగు జిమ్ముతున్నాయి. జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నరసింహనగర్‌లోని పలు వీధుల్లో వీధి దీపాలు నిత్యం వెలుగుతునే ఉన్నాయి. వీటిని నియంత్రించే వారే లేరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకొని విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు. – గోపాలపట్నం

డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం

గాజువాక: అనధికారికంగా విక్రయిస్తున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయించడానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఎక్సైజ్ సిబ్బందితో కలిసి షీలానగర్‌లో దాడి చేసి వివిధ బ్రాండ్లకు చెందిన 29 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేష్‌ను రిమాండ్‌కు తరలించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

మల్కాపురం: కేంద్రంలో మోదీ సర్కార్ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా పాలన సాగిస్తోందని పారిశ్రామిక ప్రాంత అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం ఉదయం నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు తదితరులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుడికి ప్రతి నెలా 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడాలని, స్థానికంగా గల పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగులకే అధిక ఉపాధి ప్రాధాన్యత కల్పించాలని నినాదాలు చేశారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫికర్



బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాల రద్దీ



సప్తగిరి జంక్షన్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ ఆందోళన కలిగిస్తోంది. ఉదయం పాఠశాలలు, కళాశాలకు వెళ్లే వారు.. ఉద్యోగాలకు వెళ్లేవారితో రహదారులు రద్దీగా మారుతున్నాయి . బుధవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు రహదారులు వాహనాలతో నిండిపోయాయి. బీఆర్‌టీఎస్ రెండు వైపులా సర్వీస్‌రోడ్లు మధ్య రోడ్డు రద్దీగా మారాయి. ఎన్ఏడీ నుంచి బాజీ జంక్షన్ వరకు మూడు రోడ్లు వాహనాలతో నిండి పోయాయి. ప్రధానంగా జంక్షన్ల వద్ద ఎక్కువ రద్దీ కనిపించిది. జంక్షన్ క్రాస్ చేసే వాహనాల కోసం నిలుపుదల చేసినపుడు వాహనాలు ఎక్కువగా నిలిచి పోతున్నాయి. దీని వల్ల రద్దీ ఎక్కువ అవుతుందని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా బాజీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రించేందుకు సిబ్బంది ఎక్కువగా కావాల్సి ఉంది. కానీ ఇక్కడ ఇద్దరు ముగ్గురుతోనే సరిపెడుతున్నారు. ఇది గోపాలపట్నం, కంచరపాలెం ట్రాఫిక్ స్టేషన్లతో ముడిపడి ఉండడం మరో కారణం. అలాగే సప్తగిరి జంక్షన్‌లో కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇక్కడ ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటే సరిపోతుంది. ఆ దిశగా అధికారులు ఆలోచించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– గోపాలపట్నం





పసందైన పనస



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పనసపండ్లు



నోరూరించే పనసతొనలు

- మార్కెట్‌లో విరివిగా లభ్యం

విశాఖ విద్య: సీజనల్ ఫలాల్లో పనస పండుకు మంచి క్రేజ్ ఉంది. ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే దొరికే పనసపండు రుచి చూసేందుకు ఆహారప్రియులు ఎంతో ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం పనస పండ్ల సీజన్ కావడంతో మార్కెట్‌లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఎన్ఏడీ సమీపంలోని బాజీ జంక్షన్ పరిసరాల్లో పనసపండ్లు విక్రయిస్తున్నారు. ప్రాంతీయ పశువైద్యశాల వద్ద ఉన్న సంతలోనూ ఇవి దొరుకుతున్నాయి. పండు రూ.200 నుంచి రూ.400 వరకు పలుకుతుంది. దీంతో ఎక్కువ మంది తొనల లెక్కన కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. విక్రయదారులు పండు కోసి డజను తొనలు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. పాడేరు పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి, ఇక్కడ అమ్ముతున్నామని నాగరాజు అనే వ్యకి తెలిపాడు.

పోషకాల ఘని

పనసపండు పోషకాల గని అని చెప్పవచ్చు. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ మరియు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని వైద్యులు తెలుపుతున్నారు. పనస పండు తింటే జీర్ణవ్యవస్థ మేలు చేయడంతో పాటు దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతాయని డాక్టర్ ప్రసన్న లక్ష్మి వివరించారు. గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు ఎముకలను బలోపేతం చేస్తుందన్నారు. సమతుల్య ఆహారంలో ముఖ్యమైనదని ఈ సీజన్‌లో దొరికే పనసపండు తింటే ఎంతో మంచిదని చెబుతున్నారు.

ఉచిత విద్యకు తూట్లు

- పుస్తకాల పేరిట డబ్బుల వసూళ్లు
- భాష్యం స్కూల్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం



ప్రిన్సిపాల్ గది ముందు ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: ఉచిత విద్యకు తూట్లు పొడుస్తున్న ఎన్ఏడీ భాష్యం స్కూల్ నిర్వాహకులపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత సీటు వచ్చిన వారి నుంచి పుస్తకాల పేరుతో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తుండడంతో ఎన్ఏడీ భాష్యం స్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం నిలదీశారు. ప్రభుత్వం ఫ్రీ సీటు అని, చెప్పినా ఇలా పుస్తకాల పేరుతో రూ.8 వేలు ఎందుకు కట్టించుకున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఉచిత సీటు పొందిన వారికి ప్రభుత్వం ఫీజులు ఇవ్వడం లేదని, అందుకనే తాము పుస్తకాలకు డబ్బులు వసూలు చేస్తున్నామని పాఠశాల యాజమాన్యం చెప్పటంపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్ గది ముందు ఆందోళన

ఒకవైపు పేదలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత సీటు అని చెప్పి.. మరోవైపు పుస్తకాలు, యూనిఫాం తమవద్దనే కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ గది ముందు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఉచిత సీటు పొందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ వద్దకు తరలిరావటంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. దీంతో, యాజమాన్యం వారితో చర్చించింది. తల్లికి వందనం డబ్బులు పడిన వారంతా, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు తమకు ఫీజు చెల్లించాలని సూచించారు. ఇలాంటి విషయాలు ముందే ఎందుకు చెప్పలేదని వారంతా ప్రశ్నించారు. డబ్బులు కట్టకపోతే పై తరగతులకు ప్రమోట్ చేయబోమని తమ పిల్లలకు చెప్పటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తమవద్ద కట్టించుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు తల్లిదండ్రులంతా సంతకాలు చేసి, పాఠశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యాశాఖాధికారులు ఏం చేస్తున్నారు?

ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయించడానికి వీల్లేదు. కానీ, గోపాలపట్నం మండలంలోని భాష్యం స్కూల్లో అధిక ధరలు నిర్ణయించి, పుస్తకాలు విక్రయిస్తున్నారని ఇది వరకే ఫిర్యాదులు ఉన్నాయి. కానీ, మండల విద్యాశాఖాధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ నష్టాలకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలు తప్ప మరొకటి కాదని పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ పీఈసీ హెచ్‌వీ సాగర్, జిల్లా అధ్యక్షుడు వి.కూర్మలింగం, త్రినాథ్‌రెడ్డి తదితరులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద గేట్ డిమాన్‌స్ట్రేషన్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను ఆపాలనే డిమాండ్లతో సార్వత్రిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

బీచ్‌రోడ్డు: తొలగించిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి వెంటనే తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష 1554వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు జీతాలు పెంచాలనో, రెగ్యులర్ చేయాలనో సమ్మె చేయడం లేదని, ప్రభుత్వమే పథకం ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం వల్ల వారు ఈరోజు సమ్మెలో ఉన్నారని తెలిపారు. ఇది జీవన్మరణ పోరాటం అన్నారు. ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఇప్పటికే మూడు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎక్కువ మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. అలాగే భూములిచ్చి త్యాగం చేశారని గుర్తు చేశారు. రెండవ దఫా ఎసెట్ మానిటైజేషన్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఎక్కడెక్కడి ప్రభుత్వ ఆస్తులను అమ్మేయడం, డబ్బులు చేసుకోవడమే మానిటైజేషన్ అన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారని, అయితే స్టీల్ ప్లాంట్ గురించి కనీసం మాట్లాడినట్టు వార్తలు రాలేదన్నారు. అంటే స్టీల్‌ప్లాంట్ ను వదిలించుకునే కుట్రలో భాగస్వాములు అయినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. విమల, బి. ఈశ్వరమ్మ, బి. భారతి, కె. కుమారి, జి. లక్ష్మి, డి. కొండమ్మ, వి. ప్రభావతి, కె. సంతోషం, మమత, నిర్మల, హైమావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న నరసింగరావు

అల్లిపురం: బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చి కేంద్ర బీజేపీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చింది. దీనివల్ల కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం ఏర్పాటు, సమ్మె చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని 9న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందన్నారు. యావత్ కార్మికవర్గం సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ రోజుకు 8 గంటల బదులు 12 పని గంటలు చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం సమ్మె చేస్తే ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుందన్నారు. బీఎంఎస్ లేబర్ కోడ్‌లను సమర్థిస్తూ జూలై 9 నాటి కార్మిక సమ్మెను వ్యతిరేకించడం కార్మికవర్గానికి ద్రోహం చేయడమే అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను బీఎంఎస్ సమర్థించడం సిగ్గుచేటన్నారు.